ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

సోమవారం 22 జనవరి 2024

బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి 8లో..

అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి 7లో..



యాంటీబయా 'ట్రిక్స్'

- జిల్లాలో విచ్చలవిడిగా యాంటీబయాటిక్ మందుల వినియోగం
- ప్రిస్క్రిప్షన్ లేకున్నా ఇస్తున్న మెడికల్ షాపుల యజమానులు
- కేంద్రం ఆదేశాలతోనైనా మార్పు వచ్చేనా?

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో వివిధ రకాల వ్యాధులకు యాంటీబయాటిక్ మందుల వాడకం విచ్చలవిడిగా పెరుగుతున్నది. డాక్టర్లు కూడా ఒక్క రోగానికి రెండు యాంటీబయాటిక్ మందులను రాస్తున్నారు. మందుల షాపుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా కూడా యాంటీబయాటిక్ మందులను ఇవ్వరాదనే నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ మెడికల్ షాప్‌ల యజమానులు వాటిని పాటించడం లేదు. అధిక లాభాలు వస్తుండడంతో మెడికల్ షాప్‌ల యజమానులు మందుల చిట్టీలు లేకుండా యాంటీబయాటిక్ మందులు విక్రయిస్తున్నారు. ఎక్కువగా జనరిక్ కంపెనీలకు సంబంధించిన మందులనే షాపుల యజమానులు విక్రయిస్తున్నారు. ఆసుపత్రుల వద్దగల మెడికల్ షాపుల్లో డాక్టర్లు సూచనల మేరకు ఆయా కంపెనీల మందులను విక్రయిస్తున్నారు. ఆసుపత్రులతో సంబంధం లేకుండా నడిచే మందుల షాపుల్లో ఎక్కువగా యాంటీబయాటిక్, జనరిక్ మందులను విక్రయిస్తున్నారు. అనారోగ్య సమస్యతో అనుపత్రులకు వెళితే చాలా ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్‌ను వినియోగిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యాంటిబయాటిక్స్ రాస్తే కారణం చెప్పాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు మెడికల్, ఫార్మా సంఘాలకు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్ఎస్) అతుల్ గోయల్ అన్ని మెడికల్, ఫార్మాసిస్టు సంఘాలకు, వైద్య కళాశాలలకు అత్యవసర విజ్ఞప్తి పేరిట లేఖ రాశారు. అధికారికంగా ఈ లేఖ గురువారం విడుదల అయ్యింది.

● కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు అమలయ్యేనా?

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో యాంటీబయాటిక్స్ విషయంపై ఇకనైనా మార్పు వస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల ప్రపంచ వ్యాప్తంగా యాంటీమైక్రోబియల్(ఏఎంఆర్) అనే రుగ్మత పెరిగిపోతోంది. ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న పది అనారోగ్య సమస్యల్లో ఇది ఒకటి కావడంతో 2019లో ప్రపంచ వ్యాప్తంగా 2.40లక్షల మంది ఔషధ నిరోధక ఇన్ఫెక్షన్లతో చనిపోయారని డీజీహెచ్ఎస్ అతుల్ గోయల్ తెలపడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇకనైనా మందుల చీటీలో యాంటీబయాటిక్స్ ఎందుకు రాస్తున్నారో స్పష్టంగా పేర్కొనాల్సిన అవసరం ఉంది.

● అర్హతలేని వారితోనే అధికంగా..

అర్హతలేని వారి వల్లనే యాంటీబయాటిక్స్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని వైద్య వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. అర్హత ఉన్న వైద్యులు జిల్లాలో ఇప్పటికే చాలాచోట్ల రోగి ప్రిస్క్రిప్షన్‌లో ప్రొవిజినల్ డయోగ్నసిస్‌లో ఎందుకోసం యాంటీబయాటిక్స్ రాస్తు న్నారో స్పష్టం చేస్తున్నారని వైద్య వర్గాలు చెబుతున్నాయి. అయితే మరికొంత మంది పూర్తిస్థాయిలో ఈ పద్ధతిని అనుసరించకపోయినా ఈ విధానం ఇప్పటికే అమల్లో ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రధానంగా మారుమూల ప్రాంతాల్లో నివసించే వారు అర్హతలేని వారి వద్దకు వెళ్లినప్పుడే యాంటీబయాటిక్స్ రాస్తున్నారనే ఆరోపణలున్నాయి. వారు రాసే మందులు దేనికి వినియోగిస్తారనే కనీస అవగాహన లేకపోవడంతో ప్రాథమిక స్థాయిలోనే అధిక మోతాదు యాంటీ బయాటిక్స్ వాడటం వల్ల దీర్ఘకాలంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా కొంత మంది ఆర్ఎంపీలు మెడికల్ దుకాణాలు ఏర్పాటు చేయడం, వారికి పలువురు మెడికల్ డిస్ట్రిబ్యూటర్లు ప్రోత్సాహకాలు ఇస్తుండటంతో యాంటీబయాటిక్స్ వినియోగం అదుపు తప్పుతోంది.

పెద్దపల్లి జిల్లాలో 600కు పైగా మెడికల్ షాపులు ఉండగా, యాంటీబయాటిక్స్ మందుల వినియోగం భారీగా ఉంది. వైద్య, ఆరోగ్య శాఖ అనుమతులతో దాదాపు 170ఆసుపత్రులు నడుస్తున్నాయి. ఇవి కాకుండా జిల్లాలో 550 మంది ఆర్ఎంపీలు ఉన్నారు. దీంతో యాంటిబయాటిక్ మందులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పలువురు డిస్ట్రిబ్యూటర్లు తమ బ్రాండ్ల మందులను అమ్ముకునేందుకు కొంత మంది వైద్యులకు, ఆర్ఎంపీలకు భారీగా ప్రోత్సాహకాలు ఇస్తుండటం వల్ల కూడా యాంటిబయాటిక్స్ వినియోగం పెరిగిందనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

● జిల్లాలో రోజుకు రూ.12లక్షలకు పైనే విక్రయాలు..

జిల్లాలో రోజుకు రూ.12లక్షలకు పైగా విలువైన యాంటి బయాటిక్స్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా అవసరం లేకున్నా యాంటిబయాటిక్స్ వినియోగిస్తుండటంతో అత్యవసర సమయంలో అవి పని చేయడం లేదని వైద్యవర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా అర్హతలేని వారు పూర్తిస్థాయిలో వైద్యపరమైన అవగాహన లేకుండానే యాంటిబయాటిక్స్‌ను రాస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. దీనివల్ల కొంత మందికి కొన్ని సమయాల్లో దుష్పరిణామాలు ఎదురవుతున్న సందర్భాలు ఉన్నాయి. అవగాహన లేకుండా రాసే యాంటీబయాటిక్స్ మోతాదుకు మించి వాడటంతో ఇతర ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

రామగుండానికి నిధులు మంజూరు చేయండి

- మున్సిపల్ ఏడీకి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జనవరి 21: రామగుండం నగర పాలక సంస్థ అభివృద్ధికి రూ.300కోట్ల నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మున్సిపల్ అడిషనల్ డైరెక్టర్ జాన్‌శామ్‌సన్‌ను కోరారు. రామగుండం అభివృద్ధిపై ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన ఆయన ప్రత్యేక నిధులు, స్కీమ్‌ల పెండింగ్‌లపై శని వారం అడిషనల్ డైరెక్టర్‌తో మాట్లాడారు. అమృత్ 2.0లో రూ.250కోట్ల నిధులు రావాల్సి ఉందని, ఆ నిధులతో రామగుండంలో మురుగునీటి శుద్ధి, డ్రైన్ల నిర్మాణం జరుగాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఈ స్కీమ్‌ను పెడింగ్‌లో పెట్టారనని, త్వరతగతిన మంజూరు చేయించి గోదావరి కాలుష్యాన్ని నివారించాలన్నారు. అలాగే రామగుండం నగర అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని, వెంటనే రూ.50కోట్ల ప్లాన్‌గ్రాంట్‌ను విడుదల చేయాలన్నారు. టీయూఎఫ్ఐడీసీ నుంచి కూడా రామగుండానికి నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, రోడ్లు, డ్రైన్ల నిర్మాణాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై స్పందించిన శ్యామ్‌సన్ వివిధ పథకాలపై సమీక్ష చేస్తానని, త్వరగా నిధులు విడుదలయ్యేలా చర్యలు చేపడుతానని హామి ఇచ్చినట్టు పేర్కొన్నారు.

ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

అంతర్గాం, జనవరి 21: మండల పరిధిలోని ముర్మూర్, పెద్దంపేట గ్రామాల్లోని ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆదివారం అదనపు కలెక్టర్ అరుణశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా అయాగ్రామాల్లో బీఎల్‌వోల చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. ఫారం నెం.6ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఫారం నంబరు 6,7,8ద్వారాల కొత్తగా ఓటరు నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీ రాంమోహన్‌రావు, పంచాయతీ సెక్రెటరీ రమ్య, బీఎల్‌వోలు విలమ్మ, హేమలత, భాగ్య, విజయ పాల్గొన్నారు.

పాలకుర్తి, జనవరి 21: అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ ఆదివారం పాలకుర్తి మండలంలో పర్యటించారు. మండలంలోని లక్ష్మీపురం, కుక్కలగూడూర్ గ్రామాల్లో జరుగుతున్న నూతన ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం జ్యోతి తదితరులు ఉన్నారు.

ఎలిగేడు, జనవరి 21 : మండల కేంద్రంలోని 261,263,264 పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ స్వర్ణ పరిశీలించారు. 12గ్రామాల్లో మొదటిరోజు నూతన ఓటర్ నమోదుకు 58దరఖాస్తులు వచ్చాయని ఆమె పేర్కొన్నారు. ఆదివారంతో నూతన ఓటర్ నమోదు గడువు ముగుస్తుందని, వెంటనే అర్హులైన నూతన ఓటర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. అందుకు బూత్ లెవల్ అధికారులు తగిన చొరవ తీసుకోవాలని అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఆర్‌ఐలు శైలజ, రజిత, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మైనారిటీ బాలికల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 21 : పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఫిబ్రవరి 6లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వై.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో ఫిబ్రవరి 6లోపు ఆఫ్‌లైన్ ద్వారా, ఆన్‌లైన్‌లోwww.tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చుని, వివరాలకు 9603313883, 83286 86648 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం..

కాల్వశ్రీరాంపూర్, జనవరి 21: ప్రభుత్వ పథకాలపై సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో జనగామ రాజనర్సు టీమ్ కళాకారులు మండలంలోని పెద్దంపేట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్‌వో ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు, యువత చెడు మార్గంలో నడవకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో అమలైన రెండు గ్యారంటీలు మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కళాకారులు ఈ పద్మ, కోంద్ర వెంకన్న, ఇల్లందుల మల్లేష్, జిన్నా రమ, సలేంద్ర రాజన్న, కన్నూరి రేణుక, కట్కూరి శ్రీవల్లి పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

- హుస్సేన్‌మియావాగుపై బ్రిడ్జి లేక ప్రజల అవస్థలు



కాల్వశ్రీరాంపూర్, పెద్దరాతుపల్లి మధ్య ఉన్న హుస్సేన్‌మియా వాగు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 21: మండల కేంద్రం నుంచి పెద్దరాతుపల్లికి వెళ్లే పాత దారి మధ్యనున్న హుస్సేన్‌మియా వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. గతంలో ఓదెల మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కాల్వశ్రీరాంపూర్, పందిళ్ల, పెద్దంపేట, పెగడపల్లి, గంగారం తదితర గ్రామాల ప్రజలు, పెద్దరాతుపల్లి, ఇదిలాపూర్, బేగంపేట, మంథని, ముత్తారం తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు ఎడ్ల బండ్ల ద్వారా హుస్సేన్‌మియా వాగు దాటి వెళ్లేవారు. వాగు అవతల ఆయా గ్రామాల ప్రజలు కూడా ఇదే దారిగుండా ఎడ్లబండ్లతో ఓదెల మల్లికార్జున స్వామి జాతరకు, ఇతర అవసరాలకు కాల్వశ్రీరాంపూర్‌కు వచ్చేవారు. 1985లో కాల్వ రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో కాల్వశ్రీరాంపూర్, పెద్దరాతుపల్లి మధ్య ఉన్న హుస్సేన్‌మియా వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనల వరకే ఆగిపోయింది. 2002లో గుజ్జుల రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే అయిన తరువాత ఈ ప్రాంతంలో నిర్మించాల్సిన బ్రిడ్జిని అప్పటి కొందరి రాజకీయ నాయకుల ప్రోద్బలంతో పెద్దరాతుపల్లి, చిన్నరాతుపల్లి మధ్య ఉన్న హుస్సేన్‌మియా వాగుపై నిర్మించడం జరిగింది. దీంతో ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణం ఆగిపోయింది. కాల్వశ్రీరాంపూర్ నుంచి పెద్దరాతుపల్లికి పాత దారి కేవలం మూడు కిలోమీటర్ల వరకే ఉంటుంది.

చిన్నరాతుపల్లి వద్ద బ్రిడ్జి నిర్మించిన కారణంగా కాల్వశ్రీరాంపూర్ నుంచి పెద్దరాతుపల్లి ప్రస్తుతం ఏడు కిలోమీటర్ల వర కు ఉంటుంది. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చాలా మంది రైతుల భూములు హుస్సేన్‌మియా వాగు అవతల ఉన్నాయి. దీంతో తమ ధాన్యాన్ని తీసుకువచ్చేందుకు మధ్యలో వాగు ఉన్న కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా హుస్సేన్‌మియా వాగుపై బ్రిడ్జి నిర్మించడం వల్ల గోదావరిఖని, మంథని వెళ్లేందుకు దూర భారం తగ్గుతుందని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

ఇప్పటికైనా ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి హుస్సేన్‌మియా వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఆలయ ఆవరణను శుభ్రం చేసిన బీజేపీ నాయకులు



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

సుల్తానాబాద్, జనవరి 21 : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆలయాలను శుభ్రపరచాలన్న బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సుల్తానాబాద్‌లోని హనుమండ్లపల్లి పురాతన హనుమాన్ దేవాలయం ఆవరణను నేతలు శుభ్రం చేసి ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, మండల ఉపాధ్యక్షుడు మెండ శంకరయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు చిట్టవేని సదయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బుర్ర సతీష్‌గౌడ్, పట్టణ కార్యదర్శులు పోచంపల్లి ఈశ్వర్, కందునూరి మనోహర్, కూకట్ల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 21 : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లోని పలు ఆలయాల పరిసరాలను గ్రామస్థులు శుభ్రం చేశారు. మండలంలోని అందుగులపల్లి హనుమాన్ దేవాలయ ఆవరణ శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారే శారద-శ్రీనివాస్‌తోపాటు పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భాషా పండితులకు ప్రమోషన్స్ ఇవ్వాలి

- రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ అధ్యక్షుడు అబ్దుల్లా



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్లా

పెద్దపల్లి రూరల్, జనవరి 21 : తెలంగాణ రాష్ట్రంలోని భాషా పండితుల పోస్టులు పండితులకే ప్రమోషన్‌లు ఇవ్వాలని, టీఈటీని మినహాయించాలని తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ అధ్యక్షుడు అబ్దుల్లా అన్నారు. ఆదివారం మండలంలో జిల్లా అధ్యక్షుడు సట్టు కనుకయ్య ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా హాజరై మాట్లాడారు. టెట్‌లో భాషాపండితులకు సంబంధిత సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులను కేటాయించాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భిక్షపతి, సమీ, భరత్‌కుమార్, వెంకటేశ్వర్లు, రాజేశం, మనోహర్, శ్రీనివాస్, శంకర్, కరుణాకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

రామగిరి,జనవరి 21 : ఆర్జీ త్రీ డివిజన్‌లో శ్రీజ ఇన్‌ఫ్రా సెక్యూరిటీ సర్వీసెస్‌లో పనిచేస్తున్న బూడిద రవీందర్ ఈనెల 12న గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఆర్జీ-3 డివిజన్‌లోని ఎస్అండ్‌పీసీ గార్డ్స్, ఇన్‌స్పెక్టర్ ఆల్‌జమీందార్స్, ప్రైవేట్ సెక్యూరిటీగార్డ్స్, ఆల్ సూపర్‌వైజర్స్ తమవంతు బాధ్యతగా మృతుడి కుటుంబానికి రూ.లక్ష 18వేల300 నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, నగదును పోస్టాఫీస్‌లో కుటుంబ సభ్యుల సూచన మేరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేకుర్తి కంటి ఆసుపత్రికి ఆర్థిక సహాయం

కమాన్‌పూర్, జనవరి 21 : కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి ఆదివారం రూ.20వేల నగదును అందజేశారు. జిల్లా కేంద్రంలోని స్వరూప గార్డెన్‌లో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ రీజియన్ మీట్‌లో నగదును అందజేశారు. ప్రతినెలా 20వేల రూపాయలు ఇస్తున్నట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి డాక్టర్ విజయకుమార్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సభ్యులు తిమ్మరాజు, శరత్ కుమార్, గొల్లపల్లి శంకర్‌గౌడ్, బజ్జూర్‌ఖాన్, చంద్రమౌళి, తాటికొండ శంకర్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామగుండం మేయర్‌కు అవిశ్వాస గండం

- సిద్ధమైన బీఆర్ఎస్ కార్పొరేటర్లు.. నేడు క్యాంపునకు.. - 'కోరుకంటి' విజ్ఞప్తులు బేఖాతర్..

- కాంగ్రెస్‌తో టచ్‌లోకి మేయర్.. - పరిస్థితులను అనుకూలంగా మార్చుకునే యోచనలో బీజేపీ



రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ, జనవరి 21: రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్‌కు అవిశ్వాస గండం ఏర్పడింది. సొంత పార్టీ బీఆర్ఎస్ కార్పొరేటర్లే ఆయనపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు సంతకాల సేకరణ కూడా జరుగుతుంది. సోమవారం అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం జరిగిన అనంతరం క్యాంపునకు వెళ్లేందుకు కార్పొరేటర్లు రంగం సిద్ధం చేసుకున్నారు. 41మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లలో 27 మంది కార్పొరేటర్లు క్యాంపునకు వెళ్లేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. కేసీఆర్ ఇలాక గజ్వేల్‌లోనే ఒక రిసార్ట్‌లో క్యాంపు పెట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. గత నెలలో అవిశ్వాసానికి సంతకాల సేకరణ కూడా జరిగింది. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌లు కార్పొరేటర్లతో మాట్లాడారు. ఇతర మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో అవిశ్వాసాలు జరుగుతున్నాయి. రామగుండంలో మాత్రం అవిశ్వాసం లేదని, ఇది హై కమాండ్ నిర్ణయం అంటూ కార్పొరేటర్లకు కోరుకంటి సర్దిచెప్పారు. దీంతో కార్పొరేటర్లు అవిశ్వాస యత్నాలను విరమించుకున్నారు. అనంతరం పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాలేదు. దీంతో మళ్లీ అవిశ్వాస ప్రయత్నాలు మొదలుపెట్టారు. మేయర్‌పై అవిశ్వాసానికి ఆదివారం సంతకాల సేకరణ కూడా జరిగింది. అవిశ్వాసం నుంచి గట్టెక్కేందుకు మేయర్ అనీల్‌కుమార్ తన ప్రయత్నాలు తాను చేస్తున్నాడు. పలువురు కార్పొరేటర్లతో కొంత కాలంగా ఒక గ్రూపును కూడా తయారుచేసుకున్నారు. అవిశ్వాసయత్నాలు జరుగుతుండడం, బీఆర్ఎస్ కార్పొరేటర్లు కోరుకంటి చందర్‌ను బేఖతరు చేస్తుండడంతో మేయర్ ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే ఆయన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు సన్నిహితంగా ఉంటున్నట్టు చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ నాయకులతో టచ్‌తో ఉంటున్నారు. అవసరమైతే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు కూడా ఆయన సిద్ధమైనట్టు ప్రచారం జరుగుతోంది.

హామీలు అమలుకాకపోవడమే కారణం..

రామగుండం పాలకవర్గ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ మెజార్టీ సాధించలేదు. 50మంది కార్పొరేటర్లు ఉన్న రామగుండంలో బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 11, బీజేపీ 6, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 11, ఇండిపెండెంట్లు 6 స్థానాల్లో గెలుపొందారు. స్వతంత్రులు, ఫార్వర్డ్ బ్లాక్ కార్పొరేటర్లను బీఆర్ఎస్ చేర్చుకున్నారు. బీజేపీకి చెందిన అరుగురు కార్పొరేటర్లు బీఆర్ఎస్‌లో చేరారు. ఒక కాంగ్రెస్ నుంచి గెలిచిన ముదాం శ్రీను, గాదం విజయ, కవితసరోజిని బీఆర్ఎస్‌లో చేరగా బీఆర్ఎస్ నుంచి శంకర్‌నాయక్, పాతిపెల్లి ఎల్లయ్య, అమ్రిన్ ఫాతిమా కాంగ్రెస్‌లో చేరారు. మేయర్ ఎన్నిక సందర్భంగా ఫార్వర్డ్ బ్లాక్, స్వతంత్ర కార్పొరేటర్లకు నాలుగేళ్ల తరువాత రూ.4లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఎన్నికలకు ముందు రెండు రెండు లక్షలు ఇచ్చారు. మిగతా డబ్బులు ఇవ్వలేదు. దీనికి తోడు ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లకు రూ.3లక్షల చొప్పున చెక్కులు ఇచ్చారు. ఇవి క్లియర్ కాలేదు. మేయర్ అనీల్ కుమార్ మాత్రం తాను డబ్బులు ఇచ్చేది లేదంటూ ఖరాఖండిగా చెబుతున్నట్టు సమాచారం. దీంతో డివిజన్లలో పనులు పెండింగ్‌లో ఉండడం, అభివృద్ధి పనులకు నిధులు రాకపోవడంతో కూడా అసంతృప్తికి కారణాలుగా తెలుస్తున్నది.

బీజేపీ నాయకత్వం సంప్రదింపులు

లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ సీటును కైవసం చేసుకోవాలని ప్రణాళికలు చేస్తున్న బీజేపీ ఆ దిశగా అడుగులు వేస్తున్నది. అసంతృప్తితో ఉన్న రామగుండం బీఆర్ఎస్ కార్పొరేటర్ల సంప్రదింపులు జరుపుతున్నది. బీఆర్ఎస్‌కు చెందిన కీలక ప్రజాప్రతినిధి ఒకరు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీలో చేరుతారంటూ ప్రచారం ఉంది. ఈ పరిస్థితుల్లో బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఇక్కడి పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవాలని యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. బీఆర్ఎస్ కార్పొరేటర్లు మాత్రం తాము బీఆర్ఎస్‌లోనే ఉంటున్నామని, నాయకత్వ మార్పిడి జరగాలంటూ పేర్కొంటున్నారు. ఏ నిర్ణయమైనా సమష్టిగానే అంటూ సంకేతాలిస్తున్నారు.

చంద్రపురి కాలనీలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జనవరి 21: కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని చంద్రపురి కాలనీలో శనివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటిలో అగ్నిప్రమాదం జరగ్గా రూ.8 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు యూబీఐ బ్యాంక్ మేనేజర్ శ్రీరామోజు చిరంజీవి తెలిపారు. ఏసీ, ఫ్రిడ్జ్, ఇంటీరియల్ డెరోరేషన్‌తో పాటు ఇతర వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు స్వల్పంగా గాయాలయ్యాయని తెలిపారు. బాధిత కుటుంబాన్ని కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పరామర్శించి, ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కరీంనగర్ క్రైం, జనవరి 21: కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో పేకాట ఆడుతున్న 11మంది జూదరులను పట్టుకున్నామని ఒకటో టౌన్ సీఐ జె సరిలాల్ తెలిపారు. జూదరుల నుంచి లక్షా 31వేల 200 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడిన జూదరులపై గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేశామన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 21: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు కూలీగా పనిచేస్తున్న పల్లెపు సాయి(23) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. పెద్దపల్లికి చెందిన సాయి కొంత కాలంగా బొమ్మకల్ గ్రామ శివారులోని లారీ అసోసియేషన్ వద్ద నివాసం ఉంటూ కూలి పనిచేస్తున్నాడు. 15 రోజుల నుంచి పనికి వెళ్ళకుండా మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 17న మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

హుజూరాబాద్, జనవరి 21: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు గ్యారంటీలు మాత్రమే అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రూట్ మ్యాప్ లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ భూముల మీద పడితే ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ, విశ్వవిద్యాలయాల భూములను హైకోర్టుకు ఇస్తానని అంటున్నారన్నారు. హైకోర్టును విజయవాడ లేదా నిజామాబాద్ రోడ్‌లో నిర్మించవచ్చన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రామాలయం చుట్టూ తిరగడం తప్ప ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. తెలంగాణలో నిర్మించిన ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందనేది వాస్తవమేనని, దీనిపై బీజేపీ, కాంగ్రెస్ సీబీఐ విచారణకు ఎందుకు కోరడం లేదన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఎస్పీని బలపర్చాలన్నారు.





ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
ఫోరం మాల్ - కూకట్‌పల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
గలేరియా - పంజాగుట్ట
ఐకాన్ - హైటెక్‌సిటీ
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్
ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి
ఆట్రియమ్ - గచ్చిబౌలి
ఎస్‌2 నోమ - మల్లాపూర్
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్
ఎం.పి మాల్ - కాచిగూడ
జిఎస్ఎమ్ - మదీనగూడ
నెక్లెస్ సత్య - కవాడిగూడ
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్
మంజీరామాల్ - కూకట్‌పల్లి
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
మంత్రామాల్ - అత్తాపూర్
సుధా - శాలిబండ
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఏషియన్ వైష్ణవి - ఆర్.సి.పురం
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఏషియన్ రాధిక - కాప్రా
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
మిరాజ్ సినిమాస్ - బాలానగర్
మిరాజ్ సినిమాస్ - చందానగర్
లక్ష్మీనరసింహ - మియాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
మూవీటైమ్ - అమీర్‌పేట
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
షా షహెన్‌షా - చింతల్
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మూవీమ్యాక్స్ - మౌలాలి
జె.పి.సినిమాస్ - చందానగర్

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు



భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

వేములవాడ, జనవరి 21: మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపి స్తున్న తరుణంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. సమ్మక్క సారలమ్మ దర్శనానికి ముందు రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం ఆదివారం నాడు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేము లవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తమ ఇష్ట దైవమైన రాజ రాజేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా లఘుదర్శనం అమలు చేయడం తో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రి పుర సుందరిదేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్దసంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచ మ్మ దేవాల యం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్త లు బద్దిపో చమ్మను దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులసంఖ్య భారీగా ఉండడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా భక్త లకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

● కొనసాగిన నిరంతర దర్శనం..

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో ఆదివారం రాత్రి స్వామివారి దర్శనం నిరంతరాయంగా కొనసాగింది. భారీగా పెరుగుతున్న భక్తుల రద్దీని తట్టుకునేందుకు ఆదివారాల్లో రాత్రిపూట శ్రీ స్వామివారి ఆలయం తెరిచి ఉంచాలని అధికారులు నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి స్వామివారి దర్శనం నిరంతరాయంగా కొనసాగించారు. మరో నాలుగు వారాలపాటు ప్రతి ఆదివారం రాత్రి వేళ కూడా శ్రీ స్వామివారి ఆలయం భక్తుల దర్శనం కోసం తెరిచి ఉంచుతామని ఆలయ అధికారులు తెలిపారు.

ఆదివారం నుంచి సోమవారం రాత్రి వరకు నిరంతర దర్శనం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు రానున్న నాలుగు వారాల్లో ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు నిరంతర దర్శన సౌకర్యం కల్పించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఫిబ్రవరిలో సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం కోసం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఒకవైపు మేడారం జాతర సమీపిస్తుండడం, మరోవైపు మహాశివరాత్రి పర్వదినం దగ్గర పడుతుండడంతో రాజరాజేశ్వరస్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. రద్దీ పెరుగుతున్న క్రమంలో స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సర్వదర్శనం కోసం సుమారు మూడు నుంచి నాలుగు గంటలు, కోడెమొక్కు చెల్లింపు కోసం ఐదు నుంచి ఆరు గంటలకు పైగా భక్తులు క్యూ లైన్‌లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ పరిస్థితిని అధిగమించి స్వామివారి దర్శనం త్వరగా లభించే విధంగా వచ్చే నాలుగు వారాల్లో ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు స్వామివారి ఆలయం తెరిచి ఉంచాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఆదివారం రాత్రి నిశి పూజ అనంతరం ఆలయాన్ని రాత్రంతా భక్తుల దర్శనం కోసం తెరిచి ఉంచుతారు. ఈనెల 28 తేదీ, ఫిబ్రవరి 4, 11, 18 తేదీల్లో రాత్రి వేళలో సైతం భక్తులు స్వామి వారిని దర్శించుకోవచ్చని, కోడె మొక్కు చెల్లించుకోవచ్చని ఆలయ ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు వెల్లడించారు.

● నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ..



స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం కావడం వల్ల ఉదయం గోదావరి నదిలో స్నానాలు చేశారు. భక్తులు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

గుమ్మడి కాయతో అయోధ్య రామ మందిరం



గుమ్మడి, క్యారెట్‌తో తీర్చిదిద్దిన అయోధ్య ఆలయం, ఇన్‌సెట్‌లో అనిల్

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కళాకారులు విభిన్న రీతుల్లో భక్తిభావం చాటుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్ గుమ్మడి కాయ, క్యారెట్‌తో ఆదివారం రామ మందిరం ఆకృతిని తీర్చిదిద్దాడు. రెండు గుమ్మడి కాయలు, అర కిలో క్యారెట్ కలిపి ఆలయా న్ని త్రీడీ ఆకారంలో నాలుగు గంటల్లో 12 ఇంచుల ఎత్తు, 16 ఇంచుల పొడవు, 13 ఇంచుల వెడల్పుతో అయోధ్య రామమందిరం తయారు చేశాడు. విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజున స్థానిక సత్సంగ సదనంలో జరిగే కార్యక్రమంలో తాను తయారు చేసిన ఆలయ ఆకృతిని ప్రదర్శించనున్నట్లు కళాకారుడు అనిల్ పేర్కొన్నారు.

ఖాతాదారుడి ప్రమేయం లేకుండా రూ. లక్షా 45 వేల డ్రా

- పోలీసులను ఆశ్రయించిన భాధితుడు

పెద్దపల్లి రూరల్, జనవరి 21: ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే అతని ఖాతా నుండి గత నెల 6వ తేదీ నుండి 26వ తేదీ వరకు రూ. లక్ష 46 వేల 300లను డ్రా చేశారు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న ఖాతాదారుడు లబోదిబోమంటూ ఈనెల 20వ తేదీన పెద్దపల్లి పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి మండలం గుర్రాంపల్లి గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మణ్‌గౌడ్ వ్యక్తికి పెద్దపల్లి పట్టణంలోని ఎస్‌బిఐ కమాన్ బ్రాంచిలో 00000033004053238 ఖాతా ఉంది. ఈ ఖాతా నుండి గత నెల 6వ తేదీ నుండి 26వ తేదీ వరకు రూ. లక్షా 43 వేల 300 రుపాయలు డ్రా అయ్యాయి. బ్యాంకు కువెళ్లి బ్యాలెన్స్ చూసుకునే సరికి డ్రా చేసినట్లు చూయించడంతో వెంటనే పెద్దపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దపల్లి ఎస్ఐ 2 మల్లేష్ భాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం

చొప్పదండి, జనవరి 21: మండలంలోని భూపాలపట్నం శివారులోని డి-86 కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ ఉపేంద్రాచారి తెలిపారు. కాలువ వద్ద మృతదేహం ఉన్నట్లు ఆదివారం మధ్యాహ్నం సమాచారం అందగా సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు తెలిపారు. సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం చేసినట్లు, మృతి చెందిన వ్యక్తి 40 నుంచి 45 ఏళ్ల వ్యక్తిగా తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు.

కొండగట్టులో సీతారాముల ఆనవాళ్లు

● రాముని పాదుకలు, సీతమ్మ కన్నీటి గుంతలు ● అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా భక్తుల మననం




రాముని పాదుకలు



సీత జలకాలు ఆడిన కోనేరు

మల్యాల, జనవరి 21: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో సీతారా ముల ఆనవాళ్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుండగా నేడు అయోధ్యలో ని ర్వహించే బాల రాముని ప్రాణప్రతిష్ఠోత్సవం సందర్భంగా మననం చేసుకుంటు న్నారు. కొండగట్టులో శ్రీరాముని పాదుకలు, సీతమ్మ కన్నీటి గుంతలు భక్తులను తన్మయత్వానికి గురి చేస్తున్నాయి. వీటి వద్ద భక్తులు పూజలు కూడా చేస్తుం టారు. రామలక్ష్మణ, సీతా దేవిల వనవాసం సందర్భంగా రాముడు ఇక్కడికి వచ్చా డని అప్పుడు బండ రాయిపై నిలబడినప్పుడు ఏర్పడినవే ఈ పాదుకలంటూ భ క్తులు వాటిని దర్శించుకుంటుండగా అదే సమయంలో వనవాసం సందర్భంగా సీతాదేవి ఏడవడంతో కన్నీటి దారలకు ఏర్పడినవే కన్నీటి గుంతలుగా భక్తులు పసుపు, కుంకుమతో పూజిస్తుంటారు. అలాగే కొండల రాయుడి కోటపై గల నీటి గుంతను సీతమ్మ కోనేరుగా, ఇక్కడ సీత జలకాలు ఆడినట్లు భక్తులు చెప్పుకుంటారు.

ప్రభుత్వ సలహాదారుగా హర్కార వేణుగోపాల్‌రావు



గోదావరిఖని, జనవరి 21: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా (ప్రొటోకాల్ ప్రజా సంబంధాలు) హర్కార వేణుగోపాల్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాలు జారీ చేశారు. క్యాబినెట్ ర్యాంకు హోదా కల్పించనున్నట్టు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. విలేజి రామగుండంకు చెందిన హర్కార వేణుగోపాల్‌రావు ప్రస్తుతం ఏఐసీసీ సభ్యుడిగా పని చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, జనవరి 21: మానకొండూర్ గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అన్నారం గ్రామానికి చెందిన పుసాల అక్షయ్‌కుమార్ (21) మోటార్ సైకిల్‌పై కరీంనగర్ వైపు వెళ్లుతుండగా ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులకు మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీకొందని తెలిపారు. ఈ ప్రమాదంలో అక్షయ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న శ్రీదేవసేన

సుల్తానాబాద్, జనవరి 21: అర్హులైన వారందరూ కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనీ సీనియర్ ఐఏఎస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీదేవసేన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేయడంలో భాగంగా ఆయా గ్రామాల్లో చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని, వలస వెళ్లిన వారి పేర్లను సరి చేసుకోవాలని తెలిపారు. రెండు రోజుల పాటు ప్రత్యేకంగా ఓటర్ నమోదు కార్యక్రమం ఉమ్మడి జిల్లా పరిధిలో కొనసాగుతుందని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో తాను పరిశీలించి పలు సలహాలు సూచనలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, బీఎల్వోలు పాల్గొన్నారు.

250క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● ఒకరి అరెస్టు... ముగ్గురు పరారీ

హుజూరాబాద్, జనవరి 21: హుజూరాబాద్ పట్టణ శివారులోని కరీంనగర్ రోడ్‌లో గల ఓ రైస్‌మిల్లులో 250క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హుజూరాబాద్‌లోని సీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హుజూరాబాద్ శివారులో రేషన్ బియ్యం మిల్లుల్లో దిగుమతి అవుతున్నాయని స్పెషల్ బ్రాంచీ టాస్క్‌ఫోర్స్ అధికారుల సమాచారం మేరకు సీఐలు సంతోష్‌కుమార్, బొల్లం రమేష్, ఎస్ఐ రాజు దాడులు నిర్వహించారన్నారు. ఇందులో 250క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. అలాగే బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేశామన్నారు. పట్టణానికి చెందిన ఎస్ శ్రీనివాస్ అనే వ్యక్తితో పాటు పిల్లి శ్రీధర్, సురేష్, రమేష్ బియ్యం దందా చేస్తున్నారన్నారు. వీరిలో శ్రీనివాస్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఇతనిపై గతంలో కూడా కేసులు ఉన్నాయన్నారు. రేషన్ బియ్యాన్ని హుజూరాబాద్ డివిజన్‌లో ఎవరూ కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీడీఎస్ బియ్యం దుర్వినియోగం చేస్తే పీడీయాక్టు నమోదు చేస్తామన్నారు. మిల్లర్లు కూడా రేషన్ బియ్యం కొనుగోలు చేయవద్దన్నారు. సమావేశంలో సీఐ బొల్లం రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రుక్మాపూర్‌కు ట్రైనీ ఇంజనీర్లు



సమావేశమైన ట్రైనీ ఇంజనీర్లు

చొప్పదండి, జనవరి 21: మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్‌లోని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్ ట్రైనీ అధికారులు శిక్షణ కోసం వచ్చారు. గోపాల్‌సింగ్, సనత్ రెడ్డి, రాంచందర్, శ్వేత ఉపాధ్యాయ్, సాక్షి ముద్లియార్, సఫల్‌లు శిక్షణ కోసం రాగా ఈ నెల 25 వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బస చేయనున్నారు. ఎంపీపీ చిలుక రవీందర్, ఎంపీడీవో స్వరూప, ఎంపీవో రాజగోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ విజయసారధి, కార్యదర్శి మేహతబ్, ఏపీవో రాజు, ఏపీఎం నర్మద, డాక్టర్ శైలేందర్‌లు ట్రైనీ ఇంజనీర్లతో సమావేశం అయ్యారు.

బస్సుల కోసం భక్తుల ఇబ్బందులు



వేములవాడ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, జనవరి 21: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, కోరుట్ల తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బస్సుల కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించారు. సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా వేములవాడకు భక్తుల రద్దీ పెరిగింది. అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కామ్రేడ్ లెనిన్‌కు ఘనంగా నివాళులు



పెద్దపల్లిలో కామ్రేడ్ లెనిన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



గోదావరిఖనిలో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ నాయకుడు చలపతిరావు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 21 : సీపీఎం కార్యాలయంలో కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆ పార్టీ పెద్దపల్లి ఏరియా కార్యదర్శి సీపెల్లి రవిందర్ మాట్లాడుతూ లెనిన్ అంతటి విప్లవ మహాయోధుడు, సైద్ధాంతిక ఆచరణశీలుడూ తనే కావటం కారణమని లెనిన్‌ను అర్థం చేసుకోవటం ఒక ఎత్తయితే, దాన్ని ఆచరణలో పెట్టడం మరోఎత్తు అన్నారు. ప్రపంచ మానవాళి విముక్తికి మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగెల్స్‌లు అందిస్తే దానికి అప్పటి నిర్ధిష్ట పరిస్థితులలో తన ఆలోచనలను చేర్చి ఆచరణలో పెట్టి ప్రపంచంలోనే మొట్టమొదటి సామ్యవాద కలను సాకారం చేసిన మహానేత లెనిన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి జ్యోతి, కల్లెపల్లి అశోక్, నాయకులు సీపెల్లి దిలీప్, మొదుంపల్లి శ్రావణ్, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, జనవరి 21: మానవాళి మనుగడకు కమ్యూనిజం దిక్సూచి లాంటిందని, సోవియట్ యూనియన్ స్థాపించిన వ్లైఐ లెనిన్ ప్రపంచ కమ్యూనిస్టులకు ఆదర్శ ప్రాయుడని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు పేర్కొన్నారు. ఆదివారం లెనిన్ శత వర్ధంతి సందర్భంగా స్థానిక భాస్కర్ రావు భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్టోబర్ మహావిప్లవ పోరాటాన్ని సాగించి సోవియట్‌లో బలమైన పునాదులు వేశారన్నారు. సామ్రాజ్యవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించి కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో ముందుకు సాగారన్నారు. మార్క్స్ సిద్ధాంతాన్ని అమలు చేయడంలో సఫలీకృతుడయ్యాడని, మార్క్సిజం, లెనినిజం ద్వారా అనేక దేశాల్లో విప్లవం విజయవంతం అయ్యిందన్నారు. దేశంలో మతోన్మాదులు అధికంలోకి వచ్చి పేదలను, మరింత పేదలుగా చేసున్నారని, లౌకికతాన్ని, రాజ్యాంగాన్ని రూపు మాపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలు చైతన్యవంతులైమతోన్మాదాన్ని నిలువరించేందుకు కమ్యూనిస్టులతో కలిసి రావాలన్నారు. మార్కపురి సూర్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో నాయకులు మాటేటి శంకర్, కనకయ్య, శనిగరపు చంద్రశేఖర్, రమేష్‌కుమార్, ప్రీతం, పడాల కనకరాజు పాల్గొన్నారు.

లెనిన్ జాడల్లో ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం..

మార్క్సిస్టులు సిద్ధాంతకర్త లెనిన్ ఆశయాల జాడల్లో ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జేవీ చలపతిరావు పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన లెనిన్ శత వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్క్స్ ఏంగిల్స్‌ల సిద్ధాంతాన్ని అమలు చేసి 1917లో లెనిన్ విప్లవం తీసుకువచ్చారని, దీనిని అక్టోబర్ విప్లవమంటారు. జార్ చక్రవర్తుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. అక్టోబరు విప్లవంతో ప్రపంచంలో కమ్యూనిస్టు సిద్ధాంతం వెలుగులోకి వచ్చిందని, సోషలిస్టు విజయాన్ని సాధించిన చరిత్ర లెనిన్‌దన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చి ప్రజలకు విముక్తి కలిగించిన వ్యక్తి లెనిన్ అని, ఆయన ఆశయ సాధన కోసం ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు నరేష్, కే రాజన్న, ఐ కృష్ణ, వెంకన్న, అశోక్, చిలుక శంకర్ పాల్గొన్నారు.

నేడు సదరం క్యాంపుల నిర్వహణ

సుల్తానాబాద్, జనవరి 21 : సుల్తానాబాద్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మధుకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఈ సదరం క్యాంపు జరుగుతుందనీ, కొత్తగా ఇంతకు ముందు ఏ విధమైన పెన్షన్ రానివారు, అంగవైకల్యం ఏర్పడిన వారిని ఈ క్యాంప్‌నకు తీసుకురావాలని ఆయన ఏఎన్ఎంలకు సూచించారు. కంటికి సంబంధించినవి, చెవికి సంబందించినవి ఈ క్యాంప్‌లో చూడరని పేర్కొన్నారు.

ముత్తారం, జనవరి 21 : దివ్యాంగులు పింఛన్లు రాక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించిన మంత్రి శ్రీధర్‌బాబు దృష్టిలో మండల పరిధిలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటుకు కృషి చేశారని, ఈ అవకాశాన్ని మండల దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు మండల ఆరోగ్య ఉపకేంద్రంలో జరగబోయే వెరిఫికేషన్‌కు దివ్యాంగులు హాజరుకావాలని కోరారు.

ఎలిగేడు, జనవరి 21 : మండల స్థాయిలో సదరం క్యాంప్‌నకు వెళ్లలేని వికలాంగులకు సోమవారం ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉదయం 11గంటలకు ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేయనున్నారు. అవయవాలు కోల్పోయినవారు, మానసిక వికలాంగులు, పుట్టుగుడ్డి, చెవిటి, మూగ, మంచానికి పరిమితం అయినవారు ఈ ప్రత్యేక శిబిరానికి అర్హులు. ఆధార్‌కార్డు, జిరాక్స్, ఇదివరకే పరీక్ష చేసుకుంటే సంబంధించి రిపోర్టులు వెంట తెచ్చుకోవాలని, సర్పంచ్, ఆశాలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీసీలను సంప్రదించి ఎవరెవరిని క్యాంపునకు తరలిస్తారో వారి పేర్లు ముందుగా పంపించాలని కలెక్టర్ ము జమ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ అవకాశాన్ని మండలంలోని 12 గ్రామాల్లో వివిధ రకాల వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు



గుడిపల్లిలో నిరుపయోగంగా మారిన సామూహిక మరుగుదొడ్లు

పాలకుర్తి, జనవరి 21: బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిరోధించేందుకు నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. 2019 ఆగస్టులో అప్పటి కలెక్టర్ లక్షా డెబ్బైఐదు వేల రూపాయల చొప్పున మండలంలోని 19 గ్రామపంచాయతీల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. ఊరికి దూరంగా నిర్మంచడం, నీటి వసతులు కల్పించకపోవడం, నడకదారి సరిగా లేకపోవడం తదితర కారణాలతో చాలాగ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వార్షిక లక్ష్యాలను సాధించాలి
- డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి



పని స్థలాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 21: ఆర్జీ-2 ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం ఓసీపీ-3 ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. వ్యూపాయింట్ నుంచి పని స్థలాలను పరిశీలించారు. అనంతరం క్వారీలో ఓబీ పనులు నిర్వహిస్తున్న ఆర్వీఆర్ కంపెనీ పనులను డైరెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా జీఎం సూర్యనారాయణ ఉత్పత్తి పెరుగుదలకు తీసుకుంటున్న చర్యలను డైరెక్టర్‌కు వివరించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు ఓబీ తొలగింపు పనులపై దృష్టి సారించాలని, దానికి అనుగూణంగా ప్రణాళికలను రూపొందించుకోవాలని ఓసీపీ-3 అధికారులకు డైరెక్టర్ సూచించారు. ఉత్పత్తి సాధనలో రక్షణ పాటించాలని సూచించారు. డైరెక్టర్ వెంట జీఎం సూర్యనారాయణతో పాటు పీవో మధుసూదన్, సర్వే అధికారి నర్సింగరావు, అఫీషియేటింగ్ ఎస్ఎస్‌వో వెంకటమోహన్ ఉన్నారు.

ఉత్కంఠ పోరులో సింగరేణి జట్టు విజయం
● కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ హాకీ పోటీలు

శ్రీరాంపూర్, జనవరి 21: కోల్‌ఇండియా ఇంటర్‌కంపెనీ హాకీ టోర్నమెంట్‌లో ఆదివారం జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో ఉత్కంఠపోరు కొనసాగింది. భూపాలపల్లి అంబేద్కర్ క్రీడామైదానంలో ఈనెల 18న హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(తెలంగాణ) జట్టు సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఝార్ఖండ్) జట్టుతో తలపడింది. ఇందులో సీసీఎల్ జట్టు గోల్‌చేయగా,సింగరేణి(ఎస్‌సీసీఎల్) జట్టు నాలుగు గోల్స్ చేసి విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్‌సీసీఎల్(సింగరేణి-తెలంగాణ), ఎన్‌సీఎల్(మధ్యప్రదేశ్) జట్లు తలపడగా, ఎన్‌సీఎల్ జట్టు ప్రారంభంలోనే 2గోల్స్ చేసింది. సింగరేణి జట్టు చివరి మూడునిమిషాల్లో 2గోల్స్ చేసింది. దీంతో మ్యాచ్ టై అయ్యింది. అంపైర్లు షూటవుట్ ఏర్పాటు చేయగా సింగరేణి జట్టు విజేతగా నిలిచింది.

బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి

- విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు శిక్షణ - ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు



బాలికకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఈడీ కేదార్ రంజన్



నృత్య రూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

జ్యోతినగర్, జనవరి 21 : బాలికా సాధికారతకు ఎన్టీపీసీ యాజమాన్యం కృషి చేస్తోందని, బాలికలను చదువులో మరింత ప్రోత్సహించేందుకు వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని రామగుండం ఎన్టీపీసీ, టీఎస్‌టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు పేర్కొన్నారు. ఆదివారం ఎన్టీపీసీ ఈడీసీలో జరిగిన బాలికా సాధికారత మిషన్(జెమ్) వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ఈడీ ప్రసంగించారు. ఎన్టీపీసీ సీఎస్ఆర్ పథకం ద్వారా ప్రభావిత ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రత్యేక నిధులు ఖర్చు చేస్తున్నామని, ప్రధానంగా బాలికల డ్రాపౌట్లు నిరోధించేందుకు పని చేస్తున్నామన్నారు. విద్యార్థినులలో ఆత్మవిశ్వాసం నింపేదుకు, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ (జెమ్) పేరుతో ప్రతి సంవత్సరం బాలికలకు నెలరోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఈడీ పేర్కొన్నారు. చదువుతోపాటు విద్యార్థినులకు కళలు, యోగా, డ్రాయింగ్, నృత్యం తదితర అంశాలలో నిపుణులతో తర్ఫీదును ఇప్పించామన్నారు. తాము కల్పిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. శిక్షణ పొందిన బాలికలు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈడీ కేదార్ రంజన్ పాండు ఆకాంక్షించారు. ముగింపు సందర్భంగా వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన బాలికలు మైమ్ ప్రదర్శన, నృత్యాలు చేశారు.

ఈ సందర్భంగా శిక్షణ పొందిన 54 మంది బాలికలకు సర్టిఫికెట్లు, ట్రాక్‌సూట్లను ఈడీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ ఏజీఎం (హెచ్ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్, దీప్తి మహిళా సమితి ఉపాధ్యక్షురాలు ఉజ్వల దేశాయ్, డీజీఎం ప్రశాంత్ శ్యామ్యూల్, వేముగంటి యుగంధర్ రావు, అధికారులు, మహిళా సమితి సభ్యులు, గుర్తింపు సంఘం నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కృషి
- వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబర్ సలీంపాషా

జ్యోతినగర్, జనవరి 21 : రామగుండం నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తుందని సంఘం అధ్యక్షుడు బాబర్ సలీంపాషా, ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్ తెలిపారు. ఎన్టీపీసీ పీటీఎస్‌లోని మసీదు ఆవరణలో జరిగిన సంక్షేమ సంఘం తొలి సమావేశంలో బాబర్ ప్రసంగిస్తూ రాజకీయాలకు అతీతంగా ముస్లింల సంక్షేమమే లక్ష్యంగా సంఘం పనిచేస్తుందన్నారు. నియోజకవర్గం పరిధిలోని 48 మసీదుల సభ్యులతో నిర్వహించిన మొదటి సమావేశంలో మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా ముస్లింల సమస్యల పరిష్కారం కోసం సంఘం పనిచేస్తుందని, డిమాండ్లను సాధించడలో రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలు ముస్లింలకు అందించే దిశగా కార్యాచరణ రూపొందిస్తామని, ఆర్థికంగా,విద్యాపరంగా వెనుకబడిన ముస్లింలకు చేయూతనందిస్తామన్నారు. పేదరికంలో ఉన్న ముస్లింలను ఆదుకోవడానికి వేల్ఫేర్ కమిటీలోని ప్రతి సభ్యుడు పాటు పడుతారన్నారు. సమావేశంలో నాయకులు ఎండి.షరీఫ్, ఎండి. ఫయాజ్, అబ్దుల్ సమద్, షేక్ అలీ, రియాజ్ బేగ్, సర్వర్, అక్తర్, హఫీజ్, రఫీఖ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

బస్ షెల్టర్‌లో వాహనాల పార్కింగ్

ధర్మారం, జనవరి 21: మండలంలోని పత్తిపాక ఎక్స్‌రోడ్డులో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్ వాహనాల పార్కింగ్‌గా మారింది. ప్రతి రోజు ఈ బస్‌షెల్టర్‌లో వాహనాలను నిలిపివేయడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి పత్తిపాక, నర్సింగాపూర్, ల్యాగలమర్రి, ఎల్లాపూర్ గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో పత్తిపాక ఎక్స్‌రోడ్డు వద్ద బస్సులు ఎక్కుతుంటారు. ఇక్కడ బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికుల కోసం నిర్మించిన బస్‌షెల్టర్‌లో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు రోడ్డుపై ఎండలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్‌షెల్టర్‌లో పార్కింగ్ చేసి ఉన్న వాహనాలు

రోడ్డు ప్రమాద బాధితులకు అడ్లూరి పరామర్శ



ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 21: రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిపోర్టర్ అక్కెనపెల్లి బాబుకుమార్ తీవ్రంగా గాయపడి కాలు కోల్పోవడం దురదృష్టకరమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో నేరెళ్ల గ్రామానికి చెందిన అక్కెనపెల్లి బాబుకుమార్ తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయాడు. దీంతో జగిత్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాబుకుమార్‌ను ఆయన ఆదివారం పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే ధర్మపురి పట్టణానికి చెందిన రిటైర్డ్ లైబ్రేరియన్, ముస్లిం కమిటీ నాయకులు ఎండీ అఫ్జల్ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విప్ లక్ష్మణ్‌కుమార్ ఆయనను పరామర్శించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, సుముఖ్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్ పాల్గొన్నారు.

'బైపాస్ రోడ్డుతో తీవ్రంగా నష్టపోతాం'

మెట్‌పల్లి రూరల్, జనవరి, 21 : వ్యవసాయంపై ఆధారపడి ఉన్న రైతుల భూములను బైపాస్ రోడ్డు కోసం తీసుకుంటే తీవ్రంగా నష్టపోతామని మండలంలోని రైతులు ఆవేదనతో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికు సమ స్యను తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణరావులకు మండలంలోని వెల్లుల్ల, బండలింగాపూర్, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు వినతిపత్రం అందజేసి సమస్యను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములను నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న రైతులము విలువైన భూములను ఇవ్వమని గతంలోనే చెప్పామని రైతులు పేర్కొన్నారు. రహదారి కోసం భూములు తీసుకుంటే ఉన్న జీవనోపాధి కోల్పోయి పనిలేక కుటుంబాలు రోడ్డు పాలవుతాయన్నారు. గ్రామాల మధ్య ఉన్న భూములకు గజానికి సుమారు రూ. 10 వేల నుంచి 20వేలకు విలువగల భూములను బైపాస్ రోడ్డు కోసం తీసుకుంటే ఎలా బతకాలని ఆవేదనతో తెలిపారు. దీంతో వారు స్పందించి సమస్యను కేంద్రమంత్రి నితిన్‌గడ్కార్ దృష్టికి తీసుకెళ్లి బైపాస్ రోడ్డు అలైన్మెంట్ మార్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు గడ్డి బ్రహ్మయ్య, పుప్పాల శంకర్, గుండెల జలంధర్, నరసయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి మహా కుంబాభిషేక మహోత్సవం

రాయికల్, జనవరి 21: మండలంలోని ఇటిక్యాల సాయిబాబా దేవాలయంలో సోమవారం నుంచి గురువారం వరకు మహాకుంబాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు సాయప్ప ట్రస్ట్ వైస్‌చైర్మన్ హిమవంతరావు తెలిపారు. శ్రీ జగద్గురు శంకరాచార్య, హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మల్లికార్జునస్వామికి కిలో వెండి విరాళం



మల్లికార్జునస్వామికి వెండి బిల్లలను అందజేస్తున్న కుటుంబం

ఓదెల, జనవరి 21: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన బ్రమరాంభ శ్రీ మల్లికార్జునస్వామికి ఆదివారం కమాన్‌పూర్ మండలం రొంపికుంట చెందిన కుందారపు లక్ష్మీ కుమారులు శంకర్, శ్రీనివాస్, వెంకటేష్, భాగ్యలక్ష్మీ, స్వరూపల కుటుంబాలు కలిసి కిలో వెండి బిల్లలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఈవో సదయ్య రశీదును అందజేశారు. అలాగే ఆలయంలో వివిద ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మానకొండూరు మండలం నుండి వచ్చిన భక్తులు కోడె మొక్కులను , బోనాలను సమర్పించారు.

25న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

సుల్తానాబాద్, జనవరి 21: తిరుమల తిరుపతి దర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్ద అంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 25న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ధర్మాచార్యులు మెంగని చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే వారు చంబు, కొబ్బరికాయతో దంపతులు పూజలో కూర్చోవాలని వారికి తిరుమలు నుంచి వచ్చిన సత్యనారాయణ స్వామి వారి ప్రతిమలు పూజా సామాగ్రి ఉచితంగా ఇస్తామని చంద్రశేఖర్ వివరించారు. వివరాలకు 9912078519 సెల్ ద్వారా సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముత్తారం, జనవరి 21: మండలంలోని లక్కారంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ పరామార్శించారు. ఇటీవలే మరణించిన దొరి రాములు గౌడ్ , దాంపల్లి మల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పంజాల కుమారస్వామి, తాళ్లపల్లి విష్ణు గౌడ్, దంతరవేన రమేష్, ఏడు మేకల రాజయ్య, మాదాసి రాజయ్య, తాళ్లపల్లి చంద్రమౌళి గౌడ్ , మాదాసి శ్రీకాంత్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాజీపేట పోచయ్య, గాజవీణ ఓంకార్, మద్దెల సమ్మయ్య, ఏడు మేకల రాజయ్య, సల్లూరి కిట్టు మాతంగి రాజు, పంజాల రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మృతురాలికి మాజీ ఎంపీపీ నివాళి

ముత్తారం, జనవరి 21 : మండలంలోని పారుపల్లి గ్రామ పంచాయతీలోని శాత్రాజ్ పల్లి గ్రామంలో భీముని ఓదమ్మ ఆదివారం మరణించగా ఆమె పార్థివదేహాన్ని ముత్తారం మాజీ ఎంపీపీ నాగినేని జగన్మోహన్‌రావు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసి నివాళులర్పించారు.

పోచమ్మ ఎల్లనంపు కార్యక్రమం లెక్కలపై గ్రామసభ

ధర్మారం, జనవరి 21: ధర్మారంలో నిర్వహించిన పోచమ్మ ఎల్లనంపు, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం లెక్కలపై నిర్వాహకులు స్పష్టత ఇచ్చారు. ఆదివారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పూస్కూరి జితెందర్‌రావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. మొత్తం రూ.14,46,919 విరాళాలు సేకరించగా ఎలనంపు నిర్వహించడానికి రూ.8,34,168, బొడ్రాయి ప్రతిష్ఠాపనకు రూ.5,92,780 ఖర్చయినట్టు వెల్లడించారు. ప్రస్తుతం రూ.20వేల71 నిల్వ ఉందని వివరించారు. వచ్చే నెల4న సమ్మక్క సారక్క జాతర మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటు చేసేందుకు తీర్మానించారు. ఈ గ్రామసభలో వైస్ ఎంపీపీ మేడవేని తిరుపతి, ఎంపీటీసీ సభ్యుడు తుమ్మల రాంబాబు, ఉపసర్పంచ్ ఆవుల లత, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దేవి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జాతర కమిటీ చైర్మన్‌గా పోల్సాని సుధాకర్‌రావు

పెద్దపల్లి రూరల్, జనవరి 21: మండలంలోని హన్మంతునిపేట గ్రామంలో నిర్వహించే శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పోల్సాని సుధాకర్‌రావు, గౌరవ అధ్యక్షులుగా రవికాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్ లు తీగల సదయ్య, కనపర్తి శ్రీలేఖ-ప్రభాకర్‌రావు, మేకల మల్లేష్ యాదవ్, ఎద్దు కుమారస్వామి, కొమ్ము శ్రీనివాస్‌లతో బయ్యా కోమురయ్య, మల్లయ్య, దామ కనుకయ్య, బండి సతీష్, గనబోయిన మల్లేశం, సురభి మల్హర్‌రావు, బండి సతీష్, మేకల లక్ష్మణ్ లతో పాటు పలువురు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే

ఎలిగేడు, జనవరి 21: ఆపదలో అండగా ఉంటానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని శివపల్లిలో తన స్వగృహంలో ఆయన పలువురికి ఎల్‌వోసీ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అబివృద్ధి పరచడంతో పాటు పేద అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన కె.అశ్వితకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.లక్షా25వేలు, నర్సాపూర్ గ్రామానికి చెందిన కొమురయ్యకు రూ.60వేల విలువగల ఎల్‌వోసీని నిమ్స్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, కొత్తిరెడ్డి అశోక్‌రెడ్డి, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కొప్పర తిరుమల్‌రెడ్డి, అమ్ముల శ్రీనివాస్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యకు చిత్రకళా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రమణయ్యగౌడ్

జూలపల్లి, జనవరి 21: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కవి,చిత్రకారుడు, రచయిత గుండు రమణయ్యగౌడ్ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బాపు చిత్రకళా ప్రదర్శనలో రానించి ప్రముక కళాకారులచే పురస్కారాన్ని అందుకున్నాడు. జై ఇండియన్ బుక్‌ఆఫ్ రికార్డు కొరకు ప్రముక చిత్రకారులు, కవిబ్రహ్మ బాపు గారి 90వ జన్మదినం సందర్భంగా బాపు చిత్రలేఖనం పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించగా ఈచిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నా రమణయ్యగౌడ్ బాపు చిత్రకళా పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈపురస్కారాన్ని ప్రముక నటులు, గాయకులు, ఆధ్యాత్మికవేత్త తనికెళ్ల భరణి రమణయ్యగౌడ్‌కు అంజేసినట్లు ఆయన తెలిపారు. మండల వాసికి అరుదైనా పురస్కారం దక్కడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేసారు.

అయోధ్యలైవ్ పేరుతో వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దు

కమాన్‌పూర్,జనవరి 21 : అయోధ్య లైవ్ పేరుతో వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో వచ్చే లింకులను ప్రజలు ఓపెన్ చేయొద్దని ఎస్ఐ బేతిరాములు సూచించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఫోన్లకు వచ్చే సందేశాలను, వాట్సాప్‌లకు వచ్చే లింకులను, మెయిల్స్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని తెలిపారు. వేర్వేరు పేర్లతో సైబర్ నేరగాళ్లు లింకులు పంపుతారని, ఓపెన్ చేస్తే డబ్బులను పోయే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల ప్రజాపాలన కార్యక్రమం పేరిటా ప్రజలను బురిడి కొట్టించే ప్రయత్నం చేశారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేడు మాంసం దుకాణాలు బంద్

మార్కండేయకాలనీ, జవనరి 21: అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సం దృష్ట్యా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మటన్, చికెన్‌షాపులు బంద్ పాటించనున్నట్టు ఆరెకటిక సంఘం అధ్యక్షుడు గౌళికార్ రాము, ప్రధానకార్యదర్శి గజభీంకార్ నర్సోజి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామమందిర ప్రారంభోత్సవం రోజు జీవహింస చేయవద్దని భావిస్తున్నామన్నారు.